🌐 : www.aknu.edu.in
✉ : nannayavani@aknu.edu.in
▶ : nannayanewstv
f : Adikavi Nannaya University
☎ : 9701293231

For Internal Circulation Only

# నన్నయ వాణి

An in-house Weekly Newsletter

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్

Accredited by NAAC with 'B+' Grade, ISO 9001 : 2015 & AICTE Certified

గౌరవ సంపాదకులు
ఆచార్య జి.వి.ఆర్.ప్రసాదరాజు
ఉపకులపతి (FAC)

ప్రధాన సంపాదకులు
ఆచార్య తుపాకుల అశోక్
కుల సచివులు

సంపాదకులు
డా.తలారి వాసు
సహాయాచార్య
తెలుగు శాఖ

పువ్వల ఆనంద్
ప్రజా సంబంధాల అధికారి
కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 3 | సంచిక : 31 | 01-05-2023 | పుటలు : 4

## శ్రామిక విజయం మేడే




మేడే కార్మికుల ఐక్యతకు నిదర్శనం.చైతన్యానికి ప్రతిరూపం.కార్మిక వర్గ పోరాటపటిమకు నిలువెత్తు నిదర్శనం. మే ఒకటి కొందరి కార్మికుల రక్త తర్పణంతో కార్మిక ప్రపంచానికి ప్రయోజనం చేకూర్చిన రోజు.

1886 మే 1 ఉదయం 10 గంటలకు అమెరికాలోని చికాగో నగరంలో 8 గంటల పనిదినాలను కోరుతూ లక్షలాది మంది కార్మికులు సమ్మె చేశారు. 24 గంటల్లో సమ్మె చేస్తున్న కార్మికుల సంఖ్య 4బీలక్షలు పైగా చేరింది.

దీంతో సమ్మెను చెదరగొట్టేందుకు పోలీసులు విచక్షణ రహితంగా కాల్పులు జరపడంతో ఆ ప్రాంతం రక్తసిక్తం అయింది.ఆరుగురు కార్మికుల మరణించారు. చాలామంది గాయపడ్డారు.

ఒక పోలీసును హత్య చేశారనే కారణంతో పార్సన్స్, స్పైన్,ఏంజెల్, ఫిషర్ లను దారుణంగా ఉరితీశారు.కొందరు మహనీయులు తమ రక్తాన్ని చిందించి కొన్ని రోజులను చారిత్రక దినాలుగా మారుస్తారు.అందులో వీరు కూడా ఒకరు.ఉరితీసే సమయంలో 'స్పైన్' ఈ విధంగా చెప్పారు.. "నేను ఉరి తీయబడినంత మాత్రాన ఈ అగ్నిజ్వాల అంతరించదు" "ప్రపంచ కార్మికులారా ఏకంకండి" ఈ మాటలతో ప్రపంచవ్యాప్తంగా కార్మికులలో చైతన్యం నెలకొంది.

చికాగో అమరవీరుల సంస్మరణ దినముగా మే 1 మేడేగా ప్రసిద్ధి చెందింది.ఈ ఉద్యమం సరిహద్దులు దాటి రోజుకు 8 గంటల పని దినముగా చట్టబద్ధం చేయబడింది.

1890 మే 1న అమెరికా కార్మిక సంస్థ ఏటా మే 1ను "అంతర్జాతీయ కార్మిక దినోత్సవం" గా జరుపుకోవాలని ప్రతిపాదించింది.66 దేశాలు అధికారికంగా 'మేడే' ను జరుపుకుంటున్నాయి.

భారతదేశంలో తొలిసారిగా 1923 మే 1న మద్రాసులోని లేబర్ కిసాన్ పార్టీ ఆధ్వర్యంలో మేడేను వేడుకగా జరుపుకున్నారు.

1985 తర్వాత చోటు చేసుకున్న ప్రైవేటైజేషన్, గ్లోబలైజేషన్ వంటి పరిణామాల నేపథ్యంలో కార్మిక వర్గాల కార్మిక చట్టాలు అమలుకు నోచుకోవడం లేదు.

కార్ల్ మార్క్స్ శ్రమ దోపిడీ నిర్వచించిన తర్వాత కార్మిక పోరాటాలు వాళ్ళ హక్కుల కోసం పోరాటాలు పెరుగుతూ వచ్చాయి.

"ప్రపంచ కార్మికులారా ఏకంకండి..పోరాడితే పోయేదేమీ లేదు బానిస సంకెళ్ళు తప్ప" అని ఆయన ఎలుగెత్తి చాటిన ఈ వాక్యం స్ఫూర్తితో కార్మికుల హక్కుల కోసం ఎన్నో ఉద్యమాలు జరిగాయి.

కార్మికుల శ్రమను గుర్తించిన ఎన్నో దేశాలు వాళ్ళ సంక్షేమం,వారి శ్రేయస్సు కోసం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టాయి.కానీ వాళ్ల పనికి తగిన వేతనం,సరైన గౌరవం లభించలేదనే డిమాండ్ ఇప్పటికీ ఉంది.

పెరిగిన ధరలకు తగిన విధంగా వేతనాలు ఇవ్వడం లేదని ఇప్పటికీ పోరాటం చేస్తూ ఉన్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థ బలంగా పాతుకుపోవడం వలన శ్రమదోపిడీ,ఎక్కువ పని చేయించుకోవడం సర్వసాధారణమైపోయింది. నిరుద్యోగాన్ని,బలహీనతను ఆసరాగా తీసుకొని ఎక్కువ గంటలు పని చేయించుకుంటున్నారు.

విద్య,వైద్య రంగాల్లో ప్రైవేటీకరణ అధికమై కార్మికుల ఉద్యోగ భద్రత తక్కువైపోతుంది.

ఇండియాలో కూడా 44 కార్మిక చట్టాలు కాలగర్భంలో కలిసిపోతున్నాయి. ప్రతిఘటించాల్సిన కార్మిక వర్గం ఇప్పుడు ప్రేక్షక పాత్రకు పరిమితమైంది.ఇప్పటికైనా కార్మిక,కర్షక,బడుగు, బలహీన వర్గాలు చేయిచేయి కలపడం ద్వారా శ్రామిక, కార్మిక వర్గాలకు మంచి రోజులు రావాలని ఆశిద్దాం.

మన కోసం పాటుపడే కార్మికుల శ్రేయస్సును కోరడం మంచి పౌరులుగా మన బాధ్యత!

**- బి.సుశాంత్ కుమార్**
ఎమ్మెస్సీ జువాలజీ,బి.ఎడ్.
ఆదికవి నన్నయ యూనివర్సిటీ పూర్వ విద్యార్థి

## నన్నయలో డిప్లమో ఇన్ కూచిపూడి
## కోర్సు ప్రారంభం





**29.04.23 (మీడియాసెల్)**

అంతర్జాతీయ నృత్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్ ఆధ్వర్యంలో డిప్లమా ఇన్ కూచిపూడి పార్ట్ టైం కోర్సును ప్రారంభించారు. శనివారం యూనివర్సిటీలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సెంట్రల్ లైబ్రరీలో డిప్లమా ఇన్ కూచిపూడి కోర్స్ ప్రారంభోత్సవం మరియు అంతర్జాతీయ నృత్య దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ బ్రోచర్ ఆవిష్కరించి కోర్సును ప్రారంభించారు. ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. టేకి మాట్లాడుతూ, సాంస్కృతిక రాజధాని అయిన రాజమహేంద్రవరంలోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో కూచిపూడి డాన్స్ కోర్సును ప్రారంభించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. భవిష్యత్తులో ఈ కోర్సు ద్వారా ప్రతిభావంతులైన కళాకారులను సమాజానికి అందించాలన్నారు. ఈసీ మెంబర్ ఆచార్య కె.శ్రీరమేష్ మాట్లాడుతూ, నన్నయ విశ్వవిద్యాలయంలో చాలాకాలం నుండి డాన్స్ కోర్సును ప్రారంభించేందుకు ప్రయత్నించామని నేటికి కార్యరూపం దాల్చిందని అన్నారు. ప్రిన్సిపాల్ డా.పి.విజయనిర్మల మాట్లాడుతూ డాన్స్ ద్వారా శారీరక మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. డాన్స్ కోర్స్ కోఆర్డినేటర్, డా. కె. శ్రీరాజరాజేశ్వరి దేవి, కోర్సు వివరాలను తెలియజేశారు. అనంతరం అంతర్జాతీయ నృత్య దినోత్సవం సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక, నృత్య ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ఆచార్య డి. జ్యోతిర్మయి, ప్రిన్సిపాల్ డా. పి వెంకటేశ్వరరావు డీన్. డా.ఎ.మట్టారెడ్డి, యూనివర్సిటీ ఇంజినీర్ డా. కె. నూకరత్నం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి
### జిల్లా జడ్జ్ ప్రత్యూష కుమారి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా జడ్జ్ ప్రత్యూష కుమారి

**28.04.23 (మీడియాసెల్)**

మత్తు పదార్థాలు, డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలని జిల్లా జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ ప్రత్యూష కుమారి అన్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ రాజమహేంద్రవరం ప్రాంగణంలో శుక్రవారం "నేషనల్ యాక్షన్ ప్లాన్ ఫర్ డ్రగ్ డిమెండ్ రెడ్యూక్షన్" కార్యక్రమంలో భాగంగా అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ ప్రత్యూష కుమారి హాజరై విద్యార్థుల నుద్దేశించి మాట్లాడారు. యువత డ్రగ్స్, మత్తు పదార్థాలకు బానిసై బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని సూచించారు. డ్రగ్స్ మహమ్మారి నేడు ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్న అత్యంత భయంకర వ్యసనమన్నారు. దీనిని తరిమికొట్టాల్సిన బాధ్యత యువతపై ఉందని పేర్కొన్నారు. డ్రగ్స్‌తో విచక్షణ కోల్పోతారని, ఏం చేస్తున్నారో కూడా వారికి తెలియదని అన్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల నడవడికను, అలవాట్లను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని పేర్కొన్నారు. రాజమండ్రి అడిషనల్ ఎస్పీ పి.సోమ సుందరరావు మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, మంచి సహవాసంతో ఉన్నత విద్యావంతులుగా ఎదగాలని సూచించారు. ర్యాగింగ్, డ్రగ్ వంటి జోలికిపోతే చట్టం కఠినంగా శిక్షిస్తుందని హెచ్చరించారు. ఎటువంటి సమస్యలు ఎదురైనా తమ దృష్టికి తీసుకురావాలని తెలియజేసారు. యూనివర్సిటీ స్టూడెంట్ ఆఫైర్స్ డీన్ డా.ఎన్.ఉదయభాస్కర్ మాట్లాడుతూ ప్రతీ ఏడాది యాంటీ ర్యాగింగ్, డ్రగ్ అబ్యూస్ పై సదస్సులు ఏర్పాటు చేసి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. నన్నయ విశ్వవిద్యాలయం ర్యాగింగ్ ఫ్రీ క్యాంపస్ గా గుర్తింపు పొందిదని తెలియజేసారు. అవగాహన కార్యక్రమానికి సహకరించిన వీసీ, రిజిస్ట్రార్ మరియు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అండ్ డిఫరెంట్ అబిల్ట్ అసిస్టెంట్ డైరెక్టర్ కామరాజు, ఓ.ఎస్.డి. ఆచార్య ఎస్.టేకి తదితరులు పాల్గొన్నారు.

## సంపాదకీయం



## పాత బంగారం

స్ఫూర్తిదాయకమైన శైలి, ఉత్ప్రేరకాల లాంటి వాక్యాలు, విజయకాంక్ష రగిలించే ఉదాహరణలు, పాఠకుల్లో ఏదో సాధించి తీరాలన్న ఆలోచనలని పుస్తకాలు రేకెత్తిస్తాయి. బలహీనతల్ని గెలవాలన్న పట్టుదలను పెంచుతాయి. ప్రతి పుస్తకంలోంచి తెలుసుకోవలసింది కొంత ఉంటుంది. ఆ పరిజ్ఞానం వ్యక్తిత్వ నిర్మాణానికి పనికొస్తుంది.

పుస్తకం అంటే రెండు అట్టల మధ్యన కొన్ని కాగితాలుగా కనిపించవచ్చు కానీ ఎన్నో అనుభవాలు, ఎన్నో సమస్యలకు పరిష్కారాలు, ప్రశ్నలు - సమాధానాలు, ఉద్వేగాలు దాని నిండా నిక్షిప్తమై ఉన్నాయి. "ఒక చెట్టునుంచి లక్ష అగ్గిపుల్లలు తయారు చేయవచ్చు కానీ, లక్ష చెట్లను నాశనం చేయడానికి ఒక అగ్గిపుల్ల సరిపోతుంది. అలాగే లక్ష మంచి ఆలోచనల్ని ఒక దురాలోచన నాశనం చేయగలదు. దానిని ఆపేశక్తి పుస్తకానికి ఉందంటారు" వంగీపురం శ్రీనాథాచారిగారు.

ప్రపంచీకరణ ప్రభావం, వేగవంతమైన జీవితం మన పుస్తకాల్లో విషయాన్ని గ్రహించి అన్వయించుకోగల తీరిక లేకపోవడంతో చాలా గొప్ప విషయాలు ఇప్పుడున్న తరం అందుకోలేకపోతుంది. గ్రంథాలయ అరల్లో నిధులు నిద్రిస్తున్నాయి, ముట్టుకుని చూడు తళుక్కున మెరుస్తాయంటారు ఆచార్య ఎన్. గోపి.

గోడలకు పగుళ్లు వచ్చినప్పుడు పరిష్కార మార్గాలు రెండున్నాయి. గోడకు నల్లరంగు వేయటం. పగుళ్లు కనపడవు, ఎవరు నవ్వుకోరు. ఇదో తాత్కాలిక పరిష్కారం. సమస్య నిర్మాణంలో కదా ఉంది. దాన్ని సరి చేసుకోవటం శాశ్వత పరిష్కారం. పుస్తక పఠనం వ్యక్తిత్వ నిర్మాణానికి శాశ్వత పరిష్కారాన్నిస్తుంది.

భావవ్యక్తీకరణను తమ తర్వాతి తరాలకు అందించాలనే బలమైన కోరికనుంచే అక్షరాలు, కాగితాల ఆవిష్కరణలన్నీ జరిగాయి. గూటెన్బర్గ్ పుణ్యమా అని అక్షరానికి రెక్కలొచ్చాయి. అక్షరం విప్లవాలకు, ఉద్యమాలకు, సంస్కరణలకు కారణమైంది. ఇవాళ చదవటం అనేది ముఖ్యం. అది సాఫ్ట్ కాపీనా, హార్డ్ కాపీనా అన్నదికూడా ప్రశ్నకాదు. పుస్తకాల్లోకి వెళ్లటమంటే మన మూలాల్లోకి మనం వెళ్లటమే. మనకు తెలియని ప్రపంచంలోకి మనల్ని అది విహరింపచేస్తుంది. చిన్నయసూరి నీతిచంద్రిక ప్రతికథలోని సారాంశం వ్యక్తిత్వ వికాసమే. ఒక్కో వేమన పద్యం ఒక్కో నీతి రత్నం. "ఆనోభద్రాః క్రతవోయన్తు విశ్వతః" అని ఋగ్వేదంలో మాటఉంది. ఉదాత్తమైన ఆలోచనలన్నివైపుల నుంచి మనకి లభించాలని, కలగాలని! మనకు అటువంటి ఆలోచనల్ని పుస్తకాలు నిరంతరం అందిస్తూనే ఉంటాయి.

కొన్ని కొత్త పుస్తకాలు కొంటాం. పునర్ముద్రణలేని కొన్ని పాత పుస్తకాలను వెతికి కళ్లకద్దుకుంటాం. అలా తమకు నచ్చిన గొప్ప పుస్తకాలను కొనుక్కుని, చదువుకొని ఇంకా ఎంతో మందికి ఉపయోగపడాలని దానం చేసిన ఒక పుస్తక భాండాగారంలోకి ఒకసారి అడుగు పెట్టండి. కుర్ర కవులంతా కురువృద్ధుడైన మహారచయితతో సెల్ఫీ తీసుకున్నట్లుంటుంది. నన్నయ యూనివర్సిటీలో తెలుగు మాస్టారొకరు పదేళ్లపాటు పదిహేనువేల పుస్తకాలు సేకరించి అధికారుల,అధ్యాపకుల సహకారంతో "నన్నయ భారతి" పేరుతో ఒకచోట పెట్టాడు. రంగు మారిన అట్టల్లోంచి వెలుగులీనే కాంతిని దర్శించడానికి అక్కడికి ఎవరికైనా ప్రవేశముంది. మీరొకసారి రండి! స్వాగతం!!

## సంపూర్ణ అధికారాలతోనే అభివృద్ధి

### ప్రిన్సిపాల్ డా.ఎం.కమలకుమారి




**25.04.23 (మీడియాసెల్)**

స్థానిక సంస్థలకు అధికారాలు సంపూర్ణంగా ఇచ్చినప్పుడే గ్రామ పంచాయితీలు అభివృద్ధి చెందుతాయని కాకినాడ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఎంఎస్ఎన్ క్యాంపస్ ప్రిన్సిపాల్ డా. ఎం.కమలకుమారి పేర్కొన్నారు. క్యాంపస్ రాజనీతి మరియు ప్రభుత్వ పాలనా శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఏప్రిల్ 25వ తేదీన మంగళవారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని సామర్లకోట మండలం అచ్చంపేట గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా అతిథులు మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించారు. సర్పంచ్ వి ఎస్ ఆర్ కె ఎస్ నాగభూషణరావు(చినబాబు) సభకు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో 73వ రాజ్యాంగ సవరణ చట్టం అమలులోకి వచ్చి 30 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా విభాగం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రిన్సిపాల్ డా.ఎం.కమల కుమారి మాట్లాడుతూ భారతదేశ పరిపాలనలో ఉన్న గొప్పతనం అధికార వికేంద్రీకరణ అని, గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని సాధించడానికి మనమందరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. సర్పంచ్ వీరంరెడ్డి చినబాబు మాట్లాడుతూ జగనన్న ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పలు సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు గ్రామాల అభివృద్ధికి ఎంతగానో తోడ్పడుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ఉద్దేశాన్ని కోర్సు కోఆర్డినేటర్ మరియు కన్వీనర్ డా. కె.జోసెఫ్ స్టీఫెన్ తెలియచేస్తూ స్థానిక సంస్థలకు రాజ్యాంగబద్ధమైన అధికారాలు కల్పించడం ద్వారా పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేయడానికి ఉద్దేశించినదే ఈ చట్టం అని వివరించారు. పంచాయతీరాజ్ చట్టాలను బలోపేతం చేయడంలో వివిధ కమిటీలు, వాటి సిఫార్సులను గూర్చి సహాయ ఆచార్యులు డా.ఎం.గోపి, 73వ రాజ్యాంగ సవరణలో ఉన్న 29 అంశాలను సహాయ ఆచార్యులు డా.కె.హరిబాబు సోదాహరణంగా వివరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ తోట సత్యనారాయణ, విభాగ విద్యార్థులు, గ్రామస్తులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు. అనంతరం విభాగ విద్యార్థులచే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో అమలు చేస్తున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను గూర్చి ఒక ప్రత్యేక సర్వేను నిర్వహించారు.



## గూడెం క్యాంపస్ లో 'అలా జరిగింది... 2' టీజర్ విడుదల




ఆదికవి నన్నయ యూనివర్సిటీ తాడేపల్లిగూడెం క్యాంపస్ లోని ఫార్మసీ ఆర్ట్స్ అండ్ కల్చరల్ క్లబ్ స్టూడెంట్స్ 'అలా జరిగింది పార్ట్ 2' షార్ట్ ఫిల్మ్ నిర్మించి దర్శకత్వం వహించారు. ఫార్మసీ విద్యార్థులు ఎంతో కృషి మరియు టీమ్ వర్క్ తో ఈ షార్ట్ ఫిల్మ్ నిర్మించారు. ఈ చిత్రంలో నటీనటులు మరియు సిబ్బంది ప్రత్యేకంగా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం సభ్యులు కావడం విశేషం. ఈ నేపథ్యంలో ఆర్ట్స్ అండ్ కల్చరల్ క్లబ్ ఫార్మసీ విభాగం వారు టీజర్ విడుదల కార్యక్రమాన్ని దర్శకుడు కె. విజయ్ గోవింద్ తో కలిసి నిర్వహించగా, టీజర్ ను డాక్టర్ హీరా బట్టు కోర్స్ కోఆర్డినేటర్, అధ్యాపకులు శ్రీ కె. నిత్యానందన్ రెడ్డి డిపార్ట్మెంట్ ఆఫ్ ఫార్మసీ విడుదల చేశారు. ఈ ఫంక్షన్ లో ఫార్మాస్యూటికల్ సైన్సెస్ విద్యార్థులు చురుగ్గా పాల్గొని, నటీనటులు మరియు సిబ్బందిని వారి గొప్ప విజయానికి ప్రోత్సహించారు. ప్రతి కార్యక్రమాలలో విద్యార్థులను ప్రోత్సహిస్తున్న ఇంచార్జి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.శ్రీరమేష్ కు షార్ట్ ఫిల్మ్ నటీనటులు మరియు సిబ్బంది హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

## చత్తీస్‌గఢ్‌లో మైనర్ ప్రాజెక్ట్ ఫీల్డ్ వర్క్



ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్ ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.టేకి అధ్యక్షతన చత్తీస్ గఢ్ లో మైనర్ ప్రాజెక్ట్ ఫీల్డ్ వర్క్ ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "ఫారెస్ట్ లివింగ్ కమ్యూనిటీస్ జీవనోపాధికి పర్యావరణ అనుకూల సాంకేతికతలు మరియు మైక్రోఫైనాన్స్ పాత్ర : నాన్-వుడ్ ఫారెస్ట్ ఉత్పత్తులు" అనే అంశంపై మైనర్ రీసెర్చ్ ప్రాజెక్టును చేస్తున్నామన్నారు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్(ICSSR), న్యూఢిల్లీ, నిధులతో ప్రాజెక్ట్ ను నిర్వహిస్తున్నామన్నారు. దీనిలో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పాడేరు డివిజన్ మరియు చత్తీస్గఢ్, బస్తర్ డివిజన్లో అధ్యయనం చేసామన్నారు. ఈ కార్యక్రమంలో, ఎంబీఏ అధ్యాపకులు డా.జి.రాజేంద్ర ప్రసాద్, ఎకనామిక్స్ అధ్యాపకులు డా. టి. అనిత కుమారి, డా.పి. లక్ష్మీ నారాయణ పాల్గొన్నారు.

## "వేంగీమహాజాని" రాజరాజనరేంద్రుడు



రాజరాజనరేంద్రుడు

విమలాదిత్య తనూజ!రాజిత మహావేంగీ మహాజాని !పం
చమవేదప్రథితాంధ్రభారత మహా సత్కావ్యకర్త్రాశ్రయా !
హిమవజ్జావర నిత్యపూజన తపస్వీ ! రాజరాజాహ్వయా !
అమృతాకార !చళుక్యరాజ !కొనుమయ్యా ! సన్నుతుల్,
హారతుల్.

పంచమవేదమై పరగు భారతమున్ నన్నపార్యుడన్
ప్రాంచిత సత్కవీశకృషికాగ్రణి నీ యభిలాష మేరకున్
గాంచడె తెల్గునేలతొలికావ్యపు పంటను,రాజరాజ! కా
మించుయశోలతాంగి నిను, మించెడు దక్షపురీశ్వరాద్యుతిన్.

ఘనమణిదీప్తి కంకణము, కంకణదీప్తిని రత్న మెవ్విధిన్
మనునొ విశేషశోభగనినీ మానితకీర్తిని నన్నపార్యుడున్
గనెనటు నీదు ప్రాపుగనినీ కాంచితి వీవు చిరప్రశస్తి నా
తని కృతి భారతంబుగొని, దక్కె యశోనిధి రాణ్మహేంద్రికిన్
దనరెడు గంధభూరుహపుతావులు భూమికి నబ్బునట్లుగన్.

రాజమహేంద్రి ధన్య, కవిరాజ ! మిముంగనినీ ధన్యుడయ్యె నా
రాజనరేంద్రుడాశశివిరాజిత కీర్తిసమార్జనంబునన్
తేజమునొందిరాంధ్రులు త్వదీయ కృతిన్‌బీ గయికొమ్ము భక్తి నీ
రాజనముల్ బుధావళినిరంతర మర్పనసేయుమిమ్ములన్.

**డా.యస్వీ. రాఘవేంద్రరావు**
విశ్రాంతాచార్యులు,
రాజమహేంద్రవరం.

## నాలుగేళ్ల డిగ్రీ పూర్తి చేసుకున్న వాళ్ళు

# పిహెచ్.డికి అర్హులు

**ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఫర్ హాయర్ ఎడ్యుకేషన్ వైస్ చైర్మన్ ఆచార్య కె.రామమోహనరావు**

ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఫర్ హాయర్ ఎడ్యుకేషన్ వైస్ చైర్మన్‌గా ఆచార్య కె.రామమోహనరావు కీలక బాధ్యతలను నిర్వహిస్తున్నారు. ఇటీవల ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో అనుబంధ కళాశాలలతో నిర్వహించిన సమావేశానికి వైస్ చైర్మన్ ఆచార్య కె.రామమోహనరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నన్నయ యూనివర్సిటీ మీడియా సెల్ ను ఆయన సందర్శించారు.(వారితో ఎడిటర్ ముఖాముఖి)




ముఖాముఖి

**సర్.నమస్సులు! తమ విద్యాభ్యాసం, పరిశోధన విషయాలు తెలియజేయండి**

నేను ఆంధ్రవిశ్వవిద్యాలయంలో కామర్స్ అండ్ మేనేజ్మెంట్ స్టడీస్ చేసాను.1987లో పిహెచ్.డి అవార్డు పొందాను.ఏ వృత్తికి లేని గొప్ప స్థానం గురువుకు ఉంది. నాకు గురువృత్తి అంటే చాలా ఇష్టం. నాకెంతో ఇష్టమైన గురువృత్తిలో 37 సంవత్సరాలు సేవలందించాను. 30 మంది పిహెచ్‌డి, విద్యార్థులకు మరియు 9 మంది ఎంఫిల్ విద్యార్థులకు మార్గనిర్దేశం చేసాను. 10 పుస్తకాలు మరియు 91 పరిశోధనా పత్రాలను అంతర్జాతీయ మరియు జాతీయ జర్నల్స్‌లో ప్రచురించాను. అలాగే యూజీసీ మరియు ఇతర ప్రభుత్వ మరియు ప్రైవేట్ సంస్థల నిధులతో 13 పరిశోధన ప్రాజెక్టులనుచేపట్టాను. చదువుకున్న ఆంధ్ర యూనివర్సిటీలోనే ఆచార్యునిగా సుదీర్ఘకాలం పని చేయడంతో పాటు రిజిస్ట్రార్ గా, ప్రిన్సిపాల్ గా, ఈసీ మెంబర్ గా, వివిధ శాఖల కోఆర్డినేటర్ గా పరిపాలనలో సేవలందించేందుకు అవకాశం లభించింది.

**ఎంతమంది విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ అవకాశాలను కల్పించారు సర్**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహనరెడ్డి ఉన్నత విద్యకు పెద్దపీట వేస్తున్నారు. దేశంలో ఎక్కడాలేని విధంగా విద్యారంగంలో నూతన మార్పులను తీసుకువస్తూ విద్యా ప్రమాణాలను పెంచుతున్నారు. చదువు కేవలం డిగ్రీలు పొందేందుకే కాకుండా ఉద్యోగ, ఉపాధి నైపుణ్యాలు సాధించేలా ఉండాలనే లక్ష్యంతో ఇంటర్న్‌షిప్ లను ప్రవేశపెట్టారు. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకొని సూచించిన నిబంధనల ప్రకారం రాష్ట్రంలోని విద్యార్థులకు ఆయా సంస్థలలో ఇంటర్న్‌షిప్ అవకాశాలను కల్పించాం. దేశంలో ఎప్పుడు, ఎక్కడ కనివిని ఎరుగని రీతిలో రెండు లక్షల పదిహేనువేలమంది విద్యార్థులు ఇంటర్న్‌షిప్ లను పూర్తి చేసారు.అందరి సహకారంతోనే ఇంత పెద్దఎత్తున ఇంటర్న్‌షిప్ లను కల్పించాం. ఇటీవల దేశంలోని అన్ని రాష్ట్రాలలో నిర్వహించిన ఇండియా స్కిల్స్ రిపోర్ట్ సర్వేలో ఎక్కువ ఇంటర్న్‌షిప్ లను చేసిన రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని ప్రకటించడం ఎంతో గర్వకారణం.

**నాలుగు సంవత్సరం డిగ్రీ ఏ విధంగా ఉండబోతుంది**

జూన్ నెల నుండి నాలుగవ సంవత్సరం డిగ్రీ ప్రారంభం అవుతుంది. ఇప్పుడు మూడు సంవత్సరాలు డిగ్రీ పూర్తి చేసిన వారు నాలుగ సంవత్సరం డిగ్రీలో ప్రవేశిస్తారు. నాలుగ సంవత్సరం డిగ్రీలో రెండు స్కీమ్ లు ఉంటాయి. డిగ్రీ ఆనర్స్ విత్ మేజర్, డిగ్రీ ఆనర్స్ విత్ రిసెర్చ్ గా ఉంటాయి. మూడేళ్ళ డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థి రెండు స్కీమ్ లలో ఒక దానిని ఎంపిక చేసుకొని దానిలో నాలుగవ సంవత్సరం డిగ్రీ పూర్తి చేస్తాడు. డిగ్రీ ఆనర్స్ విత్ మేజర్ లో ప్రవేశం పొందిన విద్యార్థి ఒక మేజర్ ను ఎంపిక చేసుకొని దానిలో 7,8 సెమిస్టర్ లు చదువుతారు. డిగ్రీ ఆనర్స్ విత్ రిసెర్చ్ లో ప్రవేశం పొందాలంటే మూడేళ్ళు డిగ్రీ 75 శాతంతో ఉత్తీర్ణత సాధించి ఉండాలి.

**ఏ కళాశాలల్లో రిసెర్చ్ డిగ్రీ ఉంటుంది**

అన్ని కళాశాలలు రిసెర్చ్ డిగ్రీ అవకాశాలను కల్పించలేవు. విభాగాల వారిగా రిసెర్చ్ డిగ్రీని ఆఫర్ చేయవచ్చు. రిసెర్చ్ డిగ్రీ ఆఫర్ చేసే విభాగంలో కనీసం ఇద్దరు పిహెచ్.డి చేసిన ఫ్యాకల్టీ ఉండాలి. అప్పుడు మాత్రమే నాలుగవ సంవత్సరం రిసెర్చ్ డిగ్రీ ప్రవేశం కల్పించేందుకు అవకాశం ఉంటుంది. ఒక విభాగంలో ఎంతమంది పిహెచ్.డి చేసిన ఫ్యాకల్టీ ఉన్నారో చూసి దానిని ఆధారంగా వాటి పరిధిలో సీట్లును నిర్ణయిస్తారు. ఇద్దరు పిహెచ్.డి ఫ్యాకల్టీకి పదిమంది రిసెర్చ్ డిగ్రీ విద్యార్థుల చొప్పున ప్రవేశాలు కల్పిస్తాం. ఆయా అనుబంధ కళాశాలల్లోని వనరులను, వసతులను సంబంధిత విశ్వవిద్యాలయం పరిశీలించి రిసెర్చ్ డిగ్రీకి అర్హత ఉందో, లేదో ధృవీకరించాల్సి ఉంటుంది.

**పిహెచ్.డి ప్రవేశానికి నూతన మార్గాలు ఏమిటి సర్**

నూతన జాతీయ విద్యావిధానంలో విద్యార్థులకు విద్య, పరిశోధనలకు సంబంధించి చాలా సౌలభ్యాలు కల్పించారు. దీనిలో ప్రధానంగా నాలుగ సంవత్సరం రిసెర్చ్ డిగ్రీలో 75 శాతంతో ఉత్తీర్ణులైన విద్యార్థి నేరుగా పిహెచ్.డి చేసేందుకు అర్హులవుతారు. పిహెచ్.డి చేసేందుకు తప్పని సరిగా పీజీ చేయాల్సిన అవసరం ఉండదు. ఆయా విశ్వవిద్యాలయాలు, విద్యాసంస్థలలోని సీట్లు ఆధారంగా పిహెచ్.డి అడ్మిషన్స్ అనేవి జరుగుతాయి.

**పీజీ ప్రోగ్రామ్స్ ఎలా ఉండబోతున్నాయి**

మూడు సంవత్సరాలు డిగ్రీ చేసిన విద్యార్థి నాలుగవ సంవత్సరం ఆనర్స్ ప్రోగ్రామ్ గా పీజీ లో ప్రవేశం పొందవచ్చు. స్పెషలైజేషన్ ఆధారంగా ఆయా యూనివర్సిటీలు వన్ ఇయర్ ఆనర్స్ ప్రోగ్రామ్స్ ను ఆఫర్ చేస్తాయి. వన్ ఇయర్ ఆనర్స్ ప్రోగ్రామ్ గా, మరో వన్ ఇయర్ పీజీ చేస్తే సరిపోతుంది.

**యాప్షీ నుండి విద్యాసంస్థలకు ఇచ్చే సూచన**

ఇటీవల కాలంలో దేశలోను, రాష్ట్రంలోను విద్యావ్యవస్థలో పెను మార్పులు చోటుచేసుకుంటున్నాయి. దానికి అనుగుణంగా విద్యాప్రమాణాలు, నాణ్యత ప్రమాణాలు మెరుగుపరచుకోవల్సిన అవసరం ఉంది. సీఎం జగన్మోహనరెడ్డి నూతన ఆలోచనలతో నాణ్యమైన ఉన్నత విద్యాను అందించేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి పని చేస్తుంది. డిగ్రీ కళాశాలలు డిగ్రీ సింగిల్ మేజర్ కు సన్నద్ధం కావాలి. విద్యాసంస్థల నాణ్యత ప్రమాణాలకు నిదర్శనమైన నాక్ గుర్తింపును సాధించేందుకు అన్ని విద్యా సంస్థలు ప్రయత్నం చేయండి. ఇంటర్న్ షిప్ లు, వివిధ విద్యా కార్యక్రమాలకు సహకరించిన విశ్వవిద్యాలయాలు, కళాశాలలందరికీ ధన్యవాదాలు.

**మంచిదండి. ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హాయర్ ఎడ్యుకేషన్ వైస్ చైర్మన్ గా మీరు అందిస్తున్న సేవలు మరిన్ని ఫలితాలను ఇవ్వాలని, ఆంధ్రప్రదేశ్ యువత విద్య, ఉద్యోగ, ఉపాధిలో ఉన్నత శిఖరాలను ఆదిరోహించాలని కోరుకుంటున్నాం. ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హాయర్ ఎడ్యుకేషన్ సేవలకు నన్నయవాణి తరుపున కృతజ్ఞతల్ని అందిస్తుంది.**

**నమస్కారం సర్.**

**ధన్యవాదాలు.**

**- పువ్వల ఆనంద్, పి.ఆర్.వో.**

# అప్ కాస్ట్ మైనర్ ప్రోజెక్ట్ కు డా.పి.విజయనిర్మల



ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (APCOST) ద్వారా మైనర్ ప్రోజెక్టును నిర్వహించేందుకు ప్రిన్సిపాల్, జువాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ డా.పి.విజయనిర్మలకు ఉత్తర్వులు అందాయి. దీనికి సంబంధించిన వివరాలను డా.పి.విజయనిర్మల తెలియజేస్తూ అప్ కాస్ట్ మెంబర్ సెక్రటరీ డా.వై.అపర్ణ నుండి మైనర్ ప్రోజెక్టు నిర్వహించేందుకు ప్రొసీడింగ్స్ అందాయని అన్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా "గ్రీన్ సింథసిస్ ఆఫ్ కార్బన్ క్వాంటం డాట్స్ (CQDs) నుండి Asclepidaceae కుటుంబ జాతుల నుండి క్యారెక్టరైజేషన్, యాంటీఆక్సిడెంట్ కార్యకలాపాల మూల్యాంకనం" పై అధ్యాయణం చేయాలన్నారు. ఈ అధ్యాయాన్ని సమర్ధవంతంగా పూర్తి చేసి త్వరలో నివేదిక సమర్పిస్తామని తెలియజేశారు. మైనర్ ప్రాజెక్టును మంజూరు చేసిన ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి కి, కృతజ్ఞతలు తెలిపారు. అలాగే సహకరించిన యూనివర్సిటీ వీసీ, అధికారులకు ధన్యవాదాలు తెలియజేశారు.

**మంచిమాట**



కొందరికి మనం చెప్పే సమాధానం కన్నా, కాలం చెప్పే సమాధానం కరెక్ట్ గా ఉంటుంది. ఓపిక పట్టి చూడండి. ఓపిక చాలా విలువైంది.

# ఫార్మసీ విభాగం ఫేర్వెల్ పార్టీ







ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఫార్మసీ విభాగం ఫేర్వెల్ పార్టీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. 2019 సంవత్సరం మొదటి బ్యాచ్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసినందున ఫార్మసీ విభాగం వారు సంతోషాన్ని వ్యక్త పరిచారు. 3వ సంవత్సరం విద్యార్థులు ఫేర్వెల్ పార్టీని చాలా ఘనంగా మరియు ఉల్లాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నాట్యగురువు, నాట్యాచార్య మరియు ఆచార్యదేవోభవ అవార్డు గ్రహీత శ్రీ ప్రశాంత కుమార్ గౌరవ అతిథిగా విచ్చేసి గొప్ప శాస్త్రీయ నృత్య కళ గురించి, వారి స్పూర్తిదాయకమైన మరియు ప్రేరణాత్మక ప్రసంగాలతో విద్యార్థులకు ఉల్లాసపరిచారు. చివరి సంవత్సరం విద్యార్థులు కూడా తమ నాలుగు సంవత్సరాల జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అలానే జూనియర్లకు కొన్ని సూచనలు అధ్యయన పద్ధతులు గుర్చి తెలియచేసారు. క్యాంపస్ ఇంచార్జి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. శ్రీ రమేశ్ చివరి సంవత్సరం విద్యార్థులు గ్రాడ్యుయేషన్‌ను విజయవంతంగా పూర్తి చేసినందుకు అభినందించారు. భవిష్యత్తులో ఉత్తమ కెరీర్ కోసం వారిని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమానికి డిపార్ట్‌మెంట్ కోర్స్ కోఆర్డినేటర్ డా. హీరాబట్టు మరియు అధ్యాపకులు శ్రీ కె. నిత్యనాథన్ రెడ్డి, మరియు శ్రీమతి పి.లిఖిత తదితరులు పాల్గొని చివరి సంవత్సరం విద్యార్థులు కి శుభాకాంక్షలు తెలియజేశారు.



# అంతర్జాతీయ నృత్య దినోత్సవం

ప్రతి సంవత్సరం ఏప్రిల్ 29న “అంతర్జాతీయ నృత్య దినోత్సవం”గా జరుపుకుంటున్నాం. 1982లో యునెస్కో యొక్క ‘ఇంటర్నేషనల్ డాన్స్ కమిటీ’ రచయిత ఆధునిక ఫ్రెంచ్ నృత్య,నాటికల సృష్టికర్త అయిన ‘జీన్ చార్జెస్ నోవోర్నే’ జన్మదినాన్ని పురస్కరించుకొని ఏప్రిల్ 29ను ‘అంతర్జాతీయ నృత్య దినోత్సవం’ గా ప్రకటించింది. ఈ ప్రతిపాదనను యునెస్కో 1982లో ఆమోదించింది. నృత్య కళను సజీవంగా ఉంచాలని,జాతీయ, సాంస్కృతిక చిహ్నంగా నిలిచే ఆయా ప్రాంతాల నృత్య రీతులన్నింటినీ సజీవంగా ఉంచాలనేది యునెస్కో సంస్థ యొక్క ‘కౌన్సిల్ ఆఫ్ ఇంటర్నేషనల్ డాన్స్’ ఉద్దేశం. భారతీయ నాట్య ప్రపంచంలో అతి ముఖ్యమైనవి జానపద నృత్యాలు,భాగవత నృత్యాలు,కోలాటం, పులి నృత్యం,మయూరి నృత్యం, లంబాడి,కోయ డాన్స్ మొదలైనవి. ఈ నృత్య రూపాలన్నీ దేనికవే ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. వీటి నుంచి మన సాంస్కృతిక జీవితాలను విడిగా ఊహించలేము. సంస్కృతిలో భాగంగా వీటిని మన తర్వాత తరాలకు కూడా అందివ్వాలి. అంతేకాకుండా నాట్యంతో సామాజిక చైతన్యం కలిగించిన ఎందరో కళాకారులు మన భారతదేశంలో ఉన్నారు. ఉదాహరణకు విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ రాసిన “చండాలిక” నృత్య రూపం ఆనాటి కుల వ్యవస్థను, అంటరానితనాన్ని తీవ్రంగా ప్రశ్నించిన ప్రదర్శన. అలాగే పర్యావరణం,మహిళలపై కుల,మత,సాంఘిక దురాచారాలు వంటి సామాజిక సమస్యలను నృత్యకళ లోకి చొప్పించి




ప్రజల్లో చైతన్యం కలిగించడం జరిగింది. మన భారతదేశంలో అనేక నృత్యరూపాలు ఉన్నాయి.

కథక్ (ఉత్తర ప్రదేశ్), భరతనాట్యం (తమిళనాడు),కూచిపూడి (ఆంధ్ర ప్రదేశ్) బాంగ్రా (పంజాబ్) ఘుమర్ (రాజస్థాన్),బిహూ (అస్సాం) లావణి (మహారాష్ట్ర), మణిపూరి (మణిపూర్) దాండియా,గర్భా (గుజరాత్) వంటి నృత్యరూపాలు ఆయా రాష్ట్రాల వారసత్వ, సంస్కృతిక సంపదగా చెప్పుకోవచ్చు. ఇకపోతే నృత్యంతో అనేక ఆరోగ్య ప్రయోజనాలు కూడా ఉన్నాయి. ఇది ఒక శారీరక వ్యాయామం. దీనివల్ల మానసిక ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది.

శరీరానికి ఫ్లెక్సిబిలిటీ కూడా పెరుగుతుంది. నృత్యం వల్ల హార్ట్ రేట్ స్థిరంగా ఉంటుంది. దీంతో ఆకస్మాత్తుగా గుండె జబ్బులు వచ్చే ప్రమాదం చాలా వరకు తగ్గుతుంది. ఎముకలను బలంగా ఉంచడంతో పాటు కీళ్ల నొప్పులు,కండరాల నొప్పులు ఉన్నవారికి ఉపశమనం కలిగిస్తుంది. వృద్ధాప్యంలో బ్యాలెన్సింగ్ సమస్య రాకుండా ఉండడానికి డాన్స్ ఒక అద్భుతమైన పరిష్కారం. చిన్నతనం నుండి డాన్స్ నేర్చుకునే వారికి వృద్ధాప్యంలో బ్యాలెన్సింగ్ సమస్య రాదు. ఒత్తిడి, నిరుత్సాహాన్ని తగ్గించేందుకు ఇది ఒక శాశ్వత పరిష్కారం. డాన్స్ తో శరీరం రిలాక్స్ అవడంతో మానసిక ప్రశాంతత లభిస్తుంది. నృత్యం అనేది మానవజాతి ఆవిష్కరించుకున్న అనేక కళల్లో అతి ప్రాచీనమైనది. లక్షలాది మందిని ఏకం చేసే ఒక కళారూపం. ఈనాడు నృత్య కళలు చాలావరకు అంతరించిపోతున్నాయి. మన సాంస్కృతిక చిహ్నంగా నిలిచిన ఈ నృత్యరూపాలను కాపాడుకొని ఆ తర్వాత తరాలకు కూడా అందివ్వాలని మనస్పూర్తిగా కోరుకుందాం. ఎందుకంటే మన సాంస్కృతిక సంపద మన దేశ సంపద.

**బి.సుశాంత్ కుమార్, ఎంఎస్సీ జువాలజీ,బీ.ఎడ్,**
**ఆదికవి నన్నయ యూనివర్సిటీ పూర్వ విద్యార్థి**

ప్రచురణ : మీడియా సెల్, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం-రాజమహేంద్రవరం, ఈమెయిల్ :- nannayavani@aknu.edu.in